ఏసీబీ దూకుడు..

లంచం డిమాండ్ చేస్తే 1064 కాల్ చేయాలి: ఏసీబీ

హైదరాబాద్ : రాష్ట్రంలో ఏసీబీ దూకుడు పెంచింది. అవినీతి, అక్రమాస్తుల కేసుల నమోదుతో దూసుకెళ్తుంది. కేవలం 2025 ఏప్రిల్ నెలలో మొత్తం 21 కేసుల నమోదయ్యాయి. 13 ఏసీబీ ట్రాప్ కేసులు, 2 అక్రమాస్తుల కేసులు, 2 క్రిమినల్ దుష్ప్రవర్తన కేసులు, 2 ఆశ్చర్యపరిచే తనిఖీ కేసులు, 2 సాధారణ కేసులు చేసినట్లు ప్రకటించింది. 20 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్, రిమాండ్ చేయబడ్డారు. కాగా, 5. 02 లక్షల సొమ్మును ఏసీబీ సీజ్ చేసింది. ఒక అధికారి ఇంట్లో సోదాలు చేసి 3.51 కోట్ల రూపాయల అక్రమాస్తులను గుర్తించింది. లంచం డిమాండ్ చేస్తే 1064 కాల్ చేయాలని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు పేర్కొన్నారు.

మార్కుల కేటాయింపు ఏ ప్రాతిపదికన చేపట్టారు

టీజీపీఎస్సీని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్ మే 1,(ప్రజాస్వరం): : తెలుగులో సమాధానాలు రాసిన వారికి తక్కువ మార్కులు వచ్చాయనేది అభ్యర్థుల ప్రధాన ఆరోపణ కాబట్టి.. దానికి గల కారణాలను తెలపాలని.. మార్కుల కేటాయింపు ఏ ప్రాతిపదికన చేపట్టారు అనేది పూర్తి వివరణ ఇవ్వాలని హైకోర్ట్.. టీజీపీస్సీని ఆదేశిసిస్తూ.. విచారణను రేపటికి వాయిదా వేసింది. గ్రూప్ 1 వివాదం పై గురువారం హైకోర్టులో మరోసారి విచారణ జరిగింది. టీజీపీస్సీ నిర్వహించిన గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మెయిన్స్ పేపర్ వాల్యుయేషన్ లో అక్రమాలు జరిగాయని, పరీక్ష కేంద్రాల కేటాయింపులో అనుమానాలు ఉన్నాయని, మరోసారి సమాధాన పత్రాలు వాల్యుయేషన్ చేసేలా కమిషన్ ను ఆదేశించాలని పిటిషనర్ల తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. టీజీపీస్సీ తరపున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల వాదనలు అపోహాలని, నిపుణుల పర్యవేక్షణలోనే పేపర్ వాల్యుయేషన్ జరిగిందని విన్నవించారు. కాగా తెలుగులో రాసిన వాళ్ళకు మార్కులు ఏ విధంగా కేటాయించారో స్పష్టత ఇవ్వాలని కమిషన్ ను ఆదేశించింది. అయితే ఈ వ్యవహారంపై బుధవారం జరిగిన విచారణలోనూ కమిషన్ ను ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు అడిగింది. పక్క రాష్ట్రాల్లో ఇంగ్లీషు వచ్చినా వారి మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తారని.. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇంగ్లీష్ మాట్లాడిన వారికే అధిక ప్రాధాన్యత ఇస్తారని తెలిపింది.

మీ ఉద్దేశం ఏమిటీ?

న్యూఢిల్లీ మే 1,(ప్రజాస్వరం): : కోర్టు సూచనతో వ్యాజ్యాన్ని వెనక్కి తీసుకున్న పిటిషనర్ జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది చాలా క్లిష్టమైన సమయమని, ఇలాంటి సున్నితమైన విషయాల్లో పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది.

భద్రతా బలగాల స్థైర్యం దెబ్బతీయొద్దు

ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం పిటిషనర్‌పై కొంత అసహనం వ్యక్తం చేసింది. "దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు పౌరులందరూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కలిసి రావాలి. ఇలాంటి వ్యాజ్యాలు వేసే ముందు వాటి సున్నితత్వాన్ని అర్థం చేసుకోవాలి. మీ చర్యల ద్వారా భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? దేశం పట్ల మీకు కూడా బాధ్యత ఉందని గుర్తుంచుకోండి" అని ధర్మాసనం హితవు పలికింది. ఉగ్రవాద దాడుల వంటి అంశాలను న్యాయ సమీక్ష పరిధిలోకి తీసుకురావడానికి ప్రయత్నించవద్దని స్పష్టం చేసింది.

అమరుల హోదా ఇవ్వాలి

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ

ఢిల్లీ: ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి అమరవీరుల హోదా కల్పించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఉగ్రదాడిలో మృతి చెందినవారి కుటుంబ సభ్యుల్ని ఆయన కాన్పుర్‌లో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్న రాహుల్ గాంధీ.. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి అమరవీరుల హోదా కల్పించాన్న బాధిత కుటుంబాల డిమాండ్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన పాశవిక దాడిలో తమ వారిని పోగొట్టుకొని విషాదంలో ఉన్న కుటుంబాల మనోభావాలను గౌరవించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. శుభం ద్వివేది కుటుంబ సభ్యుల్ని కలిసిన అనంతరం రాహుల్‌మీడియాతో మాట్లాడుతూ.. పహల్గాం ఘటనలో బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకు ప్రత్యేక పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కేంద్రాన్ని

కోరుతున్నాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26మంది మృతి చెందగా.. వీరిలో ఎక్కువ మంది పర్యాటకులే ఉన్న విషయం తెలిసిందే.

ప్రతి ఉగ్రవాదిని మట్టుబెడతాం

- మోదీ ప్రభుత్వంలో ఎవరూ తప్పించుకోలేరు: షా వార్నింగ్

న్యూఢిల్లీ : : దేశం నుంచి ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే మోదీ సర్కారు సంకల్పమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ప్రతి ఒక్క ఉగ్రవాదిని మట్టుబెడతామని పునరుద్ఘాటించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా, నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఏ ఉగ్రవాది తప్పించుకోలేరని చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో ప్రపంచమంతా భారత్‌తో నిలుస్తోందన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పోరాటం ఆగదన్న అమిత్ షా, ఉగ్రదాడికి పాల్పడినవారికి తగిన శిక్ష విధిస్తామని పునరుద్ఘాటించారు.

"ప్రధాని మోదీ నాయకత్వంలో అది ఈశాన్య ప్రాంతాలు కావచ్చు, వామపక్ష తీవ్రవాద ప్రాంతాలు కావచ్చు లేదా కశ్మీర్‌లోని ఉగ్రవాద ప్రాంతాలు కావచ్చు. ప్రతిదానికి మేము గట్టి సమాధానం ఇచ్చాం. ఈ పిరికిపంద దాడి ద్వారా తాము పెద్ద విజయం సాధించినట్లు ఎవరైనా భావిస్తుంటే ఒక విషయం అర్థం చేసుకోండి. ఇది మోదీ ప్రభుత్వం ఎవరూ తప్పించుకోలేరని గ్రహించాలి. దేశంలోని ప్రతి అంగుళం నుంచి ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే మా సంకల్పం.ష అని షా వెల్లడించారు.

గడువు పెంచిన భారత్

మరోవైపు పాకిస్థాన్ జాతీయులు భారత్ విడిచి వెళ్లిపోవాలన్న గడువు బుధవారంతో ముగియడంతో మరోసారి ఆ ఉత్తర్వులను కేంద్ర హోంశాఖ పొడిగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తదుపరి ఆదేశాలు



వెలువడేవరకు పాక్ జాతీయులు వాఘా-అటారీ సరిహద్దు నుంచి పాకిస్తాన్ వెళ్లేందుకు వెసులుబాటు కల్పించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అంతకుముందు పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ జాతీయులు దేశం విడిచి వెళ్లాలని కేంద్ర ఇచ్చిన ఆదేశాలు ముగియడంతో ఇరుదేశాల మధ్య ఉన్న వాఘా-అటారీ సరిహద్దును మూసివేశారు. వాఘా-అటారీ సరిహద్దు పూర్తిగా మూతపడినట్లు అధికారులు చెప్పారు. దీంతో పంజాబ్‌లోని వాఘా- అటారీ వద్దే పాక్ జాతీయులు నిలిచిపోయారు. పెద్ద సంఖ్యలో వాహనాలు సరిహద్దు వద్ద నిలిచిపోయాయి. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. గురువారం ఇరుదేశాల నుంచి ప్రజలు ఎవరూ సరిహద్దు దాటలేదని అధికారులు వెల్లడించారు. ఐతే పాకిస్థాన్ తన సరిహద్దు మూసివేసినట్లు అధికారులు చెప్పారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే మా ధ్యేయం

కార్మికులు సమ్మె ఆలోచన వీడండి..

పంతాలు, పట్టింపులకు పోకండి: సీఎం రేవంత్

హైదరాబాద్ : కార్మికులు సమ్మె ఆలోచన వీడండి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మే డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది. ఇది మీ సంస్థ.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉంది అని అన్నారు. పదేళ్లలో విధ్వంసం జరిగింది.. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీ కొనసాగిందన్నారు. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకండికని, ఏదైనా సమస్య ఉంటే మంత్రితో చర్చించండి.. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం.. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచన చేయండి అని అన్నారు. అణా పైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లేది లేదు.. మీ కోసమే ఖర్చు చేస్తాం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు.. అందుకే ఒకసారి ఆలోచించండి అని అన్నారు.

ఇక, కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉంది అని తెలిపారు. సమ్మె పోటు రాష్ట్రానికి నష్టం చేస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది.. మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుంది.. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దు.. వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు అని సూచించారు. ఆర్టీసీ కార్మికులు తనను నమ్మండి.. నమ్ముకున్న వారికి అండగా ఉంటాను అని చెప్పుకొచ్చారు.

జీఎస్టీ వసూళ్లు రూ.2.37 లక్షల కోట్లు

గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే 12.6 శాతం వృద్ధి నమోదు
ఈ టాక్స్ అమల్లోకి వచ్చాక ఇదే అత్యధిక నెలవారీ వసూలు

న్యూఢిల్లీ : దేశంలో జీఎస్టీ వసూళ్లు సరికొత్త రికార్డును నెలకొల్పాయి. 2025 ఏప్రిల్ నెలకు గాను రికార్డు స్థాయిలో రూ. 2.37 లక్షల కోట్లు వసూళ్లు నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఒక నెలలో ఇంత భారీ మొత్తం వసూలు కావడం ఇదే తొలిసారి. 2024 ఏప్రిల్ నెలలో నమోదైన రూ. 2.10 లక్షల కోట్ల వసూళ్లే ఇప్పటివరకు అత్యధికం కాగా, తాజా గణాంకాలు ఆ రికార్డును అధిగమించాయి. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ప్రస్తుత వసూళ్లలో 12.6 శాతం వృద్ధి నమోదైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అంతకుముందు నెల, అంటే 2025 మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ. 1.96 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏప్రిల్ నెల మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన పన్ను మొత్తం రూ. 1.9 లక్షల కోట్లుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఇది 10.7 శాతం అధికం. అదేవిధంగా, దిగుమతి చేసుకున్న వస్తువులపై విధించిన జీఎస్టీ ద్వారా వచ్చిన ఆదాయం రూ. 46,913 కోట్లుగా నమోదైంది. ఈ విభాగంలో వృద్ధి 20.8 శాతంగా ఉంది. ఇక రూ. 27,341 కోట్ల రిఫండ్లను జారీ చేసిన అనంతరం, నికర జీఎస్టీ వసూళ్లు రూ. 2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నికర వసూళ్లలో వృద్ధి 9.1 శాతంగా ఉందని కేంద్రం తెలిపింది. దేశంలో వివిధ పరోక్ష పన్నుల స్థానంలో 2017 జులై 1 నుంచి జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. తొలి నెలలో వసూళ్లు సుమారు రూ. 92 వేల కోట్లుగా నమోదయ్యాయి. ఆరంభంలో కొన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ, 2018 ఏప్రిల్‌లో తొలిసారిగా జీఎస్టీ వసూళ్లు లక్ష కోట్ల రూపాయల మార్కును దాటాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో వసూళ్ల వేగం కొంత తగ్గినా, 2022 ఏప్రిల్ నుంచి తిరిగి పుంజుకున్నాయి. అప్పటి నుంచి దాదాపు ప్రతినెలా రూ. 1.50 లక్షల కోట్ల పైనే వసూళ్లు నమోదవుతున్నాయి. గత ఏడాది ఏప్రిల్ లో తొలిసారి జీఎస్టీ వసూళ్లు రూ. 2 లక్షల కోట్ల మార్కును (రూ. 2.10 లక్షల కోట్లు) దాటగా, సరిగ్గా ఏడాది తర్వాత ఈ ఏప్రిల్ లో ఆ రికార్డును అధిగమించి రూ. 2.37 లక్షల కోట్లతో సరికొత్త గరిష్ఠాన్ని నమోదు చేయడం విశేషం.

రోల్ మోడల్ కాదు రాంగ్ మోడల్

కాంగ్రెస్ సర్కార్ కులగణనపై మండిపాటు
కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ నేతలు

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుల గణన రోల్ మోడల్ కాదని.. అది రాంగ్ మోడల్ అని బీజేపీ దుయ్యబట్టింది. సామాజిక న్యాయం కోసమే జన గణనతో పాటు కులగణన చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేసింది. దేశంలో 50ఏళ్ల కుపైగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు కులగణన చేయలేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పోరాటం వల్లే కుణగణనకు మోదీ సర్కార్ నిర్ణయం తీసుకుందని.. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటని... కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. 2011 జనగణనలోనే కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాసిన విషయాన్ని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణలో తూతూ మంత్రంగా సర్వే చేశారని... బీసీ ముస్లింలు అంటూ కొత్త పదాన్ని చేర్చారని దుయ్యబట్టారు.

వచ్చే మార్చి కి ప్రాజెక్టులు పూర్తి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నాగర్ కర్నూల్ : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను వచ్చేమార్చివరకు పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టంచేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను ఆయన పరిశీలించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జీరో పాయింట్, హెడ్ రెగ్యులేటర్, విద్యుత్తు ప్యానల్ బోర్డు, విద్యుత్ సబ్ స్టేషన్ , నార్లాపూర్ రిజర్వాయర్, మెయిన్ కెనాల్ ను పరిశీలించారు. ప్రాజెక్ట్ పనులపై అధికారులతో... అరా తీశారు. విద్యుత్ సబ్ స్టేషన్ పూర్తి చేయకముందే మోటర్లను ఎలా ఏర్పాటు చేశారని అధికారులపై ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పనుల ఆలస్యంపై గుత్తేదారు, అధికారులపై ఆసహనం వ్యక్తం చేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకారం భూ నిర్వాసితులకు న్యాయం చేసేలా చర్యలు చేపడతామని మంత్రి ఉత్తమ్ హామీఇచ్చారు.

ఈటల రాజేందర్‌కు చుక్కెదురు

ఆయనపై నమోదైన కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ
సెక్యూరిటీ గార్డుపై దాడి చేశారన్న ఆరోపణలపై కేసు

హైదరాబాద్ : బీజేపీ నాయకుడు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన ఒక క్రిమినల్ కేసును రద్దు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల

ప్రాంతంలోని శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఒక సెక్యూరిటీ గార్డుపై ఈటల రాజేందర్ చేయి చేసుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. ఈ ఘటనకు సంబంధించి బాధితుడైన సెక్యూరిటీ గార్డు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోచారం ఐటీ కారిడార్ పోలీసులు గతంలో ఈటలపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని అభ్యర్థిస్తూ ఈటల ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ముందు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, వాటి ఆధారంగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అందువల్ల, ప్రస్తుత దశలో కేసును కొట్టివేయడం సముచితం కాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమర్పించిన వాదనలతో ఏకీభవించింది. ఈటల రాజేందర్‌పై నమోదైన కేసును కొట్టివేయడానికి నిరాకరిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను సంబంధిత దిగువ కోర్టులోనే ఎదుర్కోవాలని ఈటల రాజేందర్‌కు సూచించింది.

కేసీఆర్ చేసిన అప్పులకే లక్షా 2 వేల కోట్లు రుణం తెచ్చాం

సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : కేసీఆర్ చేసిన అప్పులు కట్టడానికి లక్ష రెండు వేల కోట్లు అప్పు తెచ్చిన.. వడ్డీలు కట్టడానికే సరిపోతుంది.. ఏ పథకం అయినా ఆగిందా?.. అని ముఖ్యమంత్రి రేవంత్ ప్రశ్నించారు. రవీంద్ర భారతిలో జరుగుతున్న మేడే వేడుకల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారానికి ఒకరోజు సెలవు.. కార్మికుల పోరాట ఫలితమే అన్నారు. ఇక, తెలంగాణలో ఆర్థిక మాంద్యం తక్కువ ఉందన్నారు. సింగరేణిలో బెట్ సోర్సింగ్ కార్మికులకు మొదటి సారి మనమే బోనస్ ఇచ్చాం.. సింగరేణిని నిర్వీర్యం చేశారు పదేళ్లు.. కారుణ్య నియామకాలు సరళీకృతం చేశాం.. ఒక కుటుంబమే 7 లక్షల కోట్లు అప్పు చేసింది అని ఆరోపించారు. కార్మికుల పట్ల ఎప్పుడైనా అనుకూలంగా మాట్లాడారా వాళ్ళు.. లక్ష రెండు వేల కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లకు ఇచ్చాడు.. కానీ కట్టిన ముదేళ్లకే కూలి పోయింది అని మండిపడ్డారు. ఇక, ఖజానా అంతా లూటీ చేసినా ఏ పథకం ఆగలేదని తెలిపారు. పేద ప్రజల ఇండ్లో సన్న బియ్యం ఇస్తున్నాం.. గుజరాత్ లో కూడా ఏడాదిలో 58 వేల ఉద్యోగాలు ఇచ్చారా?.. నేను ఇచ్చిన.. మనం దివాలా తీశాం.. కేసీఆర్ కుటుంబం మాత్రం కోట్లు వెనకేసుకున్నారు అని ఆరోపించారు